తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
వరంగల్ - ఆదిలాబాద్
హన్మకొండ | జనగాం | ములుగు నిర్మల్ | మంచిర్యాల
ప్రొ॥ జయశంకర్ భూపాలపల్లి కొమురం భీం అసిఫాబాద్
మహబూబాబాద్
ఆదివారం
26 అక్టోబర్ 2025
పేజీలు : 08
Follow :

## భూభారతి దరఖాస్తులను

# త్వరితగతిన పరిష్కరించాలి

- **వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**వరంగల్ ప్రతినిధి, అక్టోబర్ 25(జనంసాక్షి):** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూభారతి కార్యక్రమం ద్వారా రైతులు సకాలంలో తమ భూ సంబంధిత సమస్యలను పరిష్కరించుకునేలా చొరవ చూపాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి అన్నారు. శనివారం కలెక్టర్ డాక్టర్ సత్య శారద డి ఆర్ ఓ విజయలక్ష్మి తో కలసి వర్ధన్నపేట తహసిల్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాల యంలో పలు రికార్డులను పరిశీలించారు. మండలంలోని తహసిల్దార్, ఇతర సిబ్బందితో భూభారతి అమలుపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూభారతి కార్యక్రమాన్ని రైతులు భూ సంబంధిత సమస్యలను పరిష్కరించు కునేందుకు చొరవ చూపాలన్నారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులలో ఆయా మాడ్యుల్స్ లో ఎన్ని అర్జీలు పరిష్కరించారు ? ఎన్ని పెండింగ్ లో ఉన్నాయి? ఎంత మందికి నోటీసులు ఇచ్చారు? క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ పూర్తయ్యిందా..? లేదా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయి పరిశీలన నిర్ణీత గడువు లోపు అన్ని దరఖాస్తులు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. దరఖాస్తులు తిరస్కరణకు గురైనట్టయితే అందుకు గల కారణాలు స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. సాదా బైనామా, పీఓటీ లకు సంబంధించిన అప్లికేషన్ లను క్షుణ్ణంగా పరిశీలించాలని వెంటనే నోటీసులు జారీ చేస్తూ క్షేత్రస్థాయిలో వెరిఫికేషన్ నిర్వహించాలన్నారు. భూభారతి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఆర్జీల పరిష్కారంలో జాప్యం జరుగకుండా రోజువారీగా దరఖాస్తుల పరిశీలనను పర్యవేక్షిస్తూ.. వేగవంతంగా వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మీసేవ సర్టిఫికెట్లను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేసి సకాలంలో సర్టిఫికెట్ల ప్రజలకు అందజేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఎం ఎల్ యస్ పాయింట్ ద్వారా ప్రజలకు బియ్యం, నిత్యావసర సరుకులు వంటివి సరైన నాణ్యతతో, సరైన బరువుతో సరఫరా అవుతున్నాయో లేదో ఆకస్మికంగా తనిఖీ చేసి నివేదిక సమర్పించాలని డి ఎస్ ఓ, పౌర సరఫరాల డిఎం , తహశీల్దారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమీక్షలో తహశీల్దార్ విజయ్ సాగర్, నాయబ్ తహసీల్దార్ వినయొందర్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 59 మద్యం దుకాణాలకు

# 1863 దరఖాస్తులు

- **టెండర్ల ద్వారా వచ్చిన ఆదాయం 55 కోట్ల 89 లక్షల రూపాయలు**
- **ఈ నెల 27న లాటరీల ద్వారా మద్యం దుకాణదారుల ఎంపిక**



**ములుగు బ్యూరో,అక్టోబర్25(జనం సాక్షి):** 2025 నుంచి 2027 రెండు సంవత్సరాలకు గాను ఎ4 మద్యం షాపుల దరఖాస్తు ప్రక్రియ 23 అక్టోబర్ 2025 తో ముగిసింది. భూపాలపల్లి ఎక్సైజ్ యూనిట్ లోని మొత్తం 59 మద్యం షాపులకు గాను 1863 దరఖాస్తులు రావడం జరిగింది. దరఖాస్తు ఫీజు రూపంలో 55 కోట్ల 89 లక్షల రూపాయల ఆదాయం ఆర్జించడం జరిగింది. భూపాలపల్లి ఎక్సైజ్ యూనిట్లో అత్యధికంగా మల్లంపల్లి గ్రామం మరియు మండలం మద్యం షాపుకు 77 దరఖాస్తులు రావడం జరిగింది. 27 అక్టోబర్ 2025 సోమవారం రోజున మద్యం షాపుల కేటాయింపుకు సంబంధించిన లాటరీ ప్రక్రియను భూపాలపల్లి పట్టణంలోని మంజూరు నగర్ లోని ఇల్లెందు క్లబ్ హౌస్ ఫంక్షన్ హాల్ నందు జిల్లా కలెక్టర్ మరియు మేజిస్ట్రేట్ రాహుల్ శర్మ సమక్షంలో ఉదయం 10 గంటలకు నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి భూపాలపల్లి మిగతా 8లో..

## ప్రభుత్వ స్థలాలకు ఫెన్సింగ్‌లు

# ఏర్పాటు చేయండి

- **మినీ సెకండరీ ట్రాన్స్ఫర్ స్టేషన్ లో చెత్త తరలింపు పరిశీలన...**



**వరంగల్ ఎంజీఎం, అక్టోబర్ 25(జనంసాక్షి):** ప్రభుత్వ స్థలాలు ఆక్రమణ లకు గురికాకుండా ఫెన్సింగ్ (కంచెలు) ఏర్పాటు చేయాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులకు సూచించారు. శనివారం నగర పరిధి లోని గొర్రెకుంట, కీర్తినగర్ కోటిలింగాల ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి శానిటేషన్ తో పాటు టౌన్ ప్లానింగ్ కు చెందిన అంశాలను పరిశీలించి సమర్ధవంతం గా చేపట్టుటకు అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భం గా కమిషనర్ సానిటేషన్ ఇన్స్పెక్టర్ల తో పాటు ప్రభుత్వ స్థలాలకు సంబంధించిన ఓపెన్ స్పేస్ ల గుర్తింపు కీర్తినగర్ ప్రాంతం లో మినీ సెకండరీ ట్రాన్స్ఫర్ స్టేషన్ (నవీకరించిన క్యాంపాక్టర్ కు స్వచ్ఛ ఆటో నుండి నేరుగా చెత్త ను డంప్ చేసుకొని వెళ్ళడం)ను పరిశీలించి మాట్లాడుతూ చెత్త నేరు గా సెకండ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ కు తరలించకుండా ఇంధనాన్ని సమయాన్ని ఆదా చేయడానికి మినీ సెకండ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ ను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రభుత్వ స్థలాలకు సంబంధించిన ఓపెన్ స్పేస్ లను క్షేత్ర స్థాయిలో పరిశీలించి అధికారులకు సూచనలు చేస్తూ ప్రభుత్వానికి చెందిన ఓపెన్ స్పేస్ లను గుర్తించాలని అవి ఆక్రమణలకు గురికాకుండా వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ ఓపెన్ స్పేస్ లో బయో కంపోస్ట్ యూనిట్ ఏర్పాటు చేయాలని ముఖ్య ఆరోగ్యాధికారికి సూచించారు. గొర్రెకుంట ప్రాంతం లో పర్యటించిన క్రమం లో ఆక్రమణలను గమనించిన కమిషనర్ వాటిని తొలగించాలని ఇదే ప్రాంతం లో మరో చోట రోడ్డు ను ఆక్రమించడాన్ని పరిశీలించి ఆ ప్రాంతం లో డ్రైనేజీ నిర్మించాలని అధికారులను ఆదేశించారు. కీర్తినగర్ లో 4 ఓపెన్ స్పెసెస్ లలో ఇప్పటికే 2 ప్రాంతాల్లో ఫెన్సింగ్ చేసినందున మిగతా ప్రాంతాలకు వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి, ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఎం హెచ్ ఓ డా.రాజేష్, ఈ ఈ సంతోష్ బాబు, ఏ సి పి శ్రీనివాస్ రెడ్డి, డి ఈ సతీష్, టిపిఎస్ శ్రీకాంత్, టి పి బి ఓ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీ అధికారులకు పట్టుబడిన

# జిల్లా సహకార అధికారి

- **రెండు లక్షల లంచం తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ**



**మంచిర్యాల ప్రతినిధి, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** అవినీతి నిరోధకశాఖ (ఏసిబి) అధికారులు, ప్రభుత్వ అధికారులపై పలుమార్లు దాడులు చేసినప్పటికీ అవినీతి అధికారుల తీరు మారడం లేదు .అవినీతికి పాల్పడే ప్రభుత్వ అధికారుల్లో ఏ మాత్రం భయం లేకుండా లక్షలకు లక్షలే అక్రమంగా లంచాలకు పాల్పడుతున్నారు. సొసైటి ఆడిటింగ్‌లో అవకతవకలకు పాల్పడ్డ సస్పెన్షన్‌కు గురైన ఓ ఉద్యోగి వేతనాలను పెంచి ఇవ్వడానికి 7 లక్షల రూపాయలు డిమాండ్ చేసి 5 లక్షలకు ఒప్పందం చేసుకొని మొదటి దశలో రెండు లక్షల రూపాయలు తీసుకుంటూ జిల్లా సహకార అధికారి రాథోడ్ బిక్కు నాయక్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు.

మంచిర్యాల జిల్లా కోపరేటివ్ సొసైటీ జిల్లా సహకార అధికారిగా విధులు నిర్వహిస్తున్న రాథోడ్ బిక్కు నాయక్ అనే అధికారి, మంచిర్యాల పట్టణంలోని ఇక్బాల్ అహ్మద్ నగర్ లో నివాసం ఉంటున్నాడు. బెజ్జుర్ పీఏసీఎస్ సెక్రటరీ వెంకటేశ్ గౌడ్ సొసైటీ లెక్కల అవకతవకలపై 2024 నవంబర్ లో సస్పెండ్ అయినాడు . అతని సస్పెండ్ ఎత్తివేయడంతోపాటు సస్పెండ్ అయిన కాలంలో 44 జీరో ప్రకారం పెరిగిన వేతనాన్ని కలిపి ఇవ్వడానికి సహకార అధికారి 7 లక్షల రూపాయల డిమాండ్ చేయడంతో సదరు ఉద్యోగి 5 లక్షలకు మాట్లాడుకుని ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు . ఏసీబీ అధికారులు కలర్ తో మిక్స్ అయిన రెండు లక్షల రూపాయలను సంబంధిత గౌడ్ కు ఇవ్వడంతో ఆయన జిల్లా కోపరేటివ్ అధికారి రాథోడ్ బిక్ నాయక్ ఇంటికి వెళ్లి 2 లక్షల రూపాయలు ఇస్తుండగా అక్కడే మాటివేసిన ఏసీబీ అధికారులు లంచం తీసుకుంటున్న అధికారిని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు . ఆదిలాబాద్ ఏసీబీ డిఎస్పీ మధు బృందం పట్టుబడిన రాథోడ్ బిక్కు నాయక్ ను కరీంనగర్ ఏసీబీ కోర్టుకు తరలించారు .

### పట్టుబడిన అధికారి అసిఫాబాద్ జిల్లాకు ఇంచార్జ్

మంచిర్యాల జిల్లా కోపరేటివ్ రిజిస్టార్ గా రెండు నెలల క్రితం అసిఫాబాద్ జిల్లా నుండి మంచిర్యాలకు బదిలీపై వచ్చాడు. ఆసిఫాబాద్ జిల్లాకు ఈయన స్థానంలో నూతన అధికారి రాకపోవడంతో ఇతనే ఇన్‌ఛార్జి గా వ్యవహరిస్తున్నారు. మూడు సంవత్సరాల నుండి ఆసిఫాబాద్‌లో జిల్లాలో విధులు నిర్వహిస్తున్న కోపరేటివ్ జిల్లా అధికారి రాథోడ్ బిక్కు నాయక్ పై గతంలో కూడా పలు ఆరోపణలు ఉన్నట్లు సమాచారం. ఆసిఫాబాద్ జిల్లాలోని పలువురు పీఏసీఎస్ సెక్రటరీలను వేదిస్తూ అక్రమాలకు పాల్పడేవారని ఆరోపణలు ఉన్నాయి .

# కాళేశ్వరంలో భక్తుల సందడి



**కాళేశ్వరం , అక్టోబర్ 26 , ( జనం సాక్షి).** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రం కాళేశ్వరం లో కార్తీకమాసం సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. కార్తీకమాసం శనివారం మరియు నాగుల చవితి రావడంతో భక్తులు ఉదయాన్నే గోదావరిలో స్నానమాచరించి ఆలయానికి విచ్చేసి నవగ్రహ, కాలసర్ప పూజల లో పాల్గొన్నారు. అనంతరం కాళేశ్వర ముక్తేశ్వర స్వామివారలకు అభిషేకం నిర్వహించి అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన జరిపారు. నాగుల చవితి సందర్భంగా ఆలయం వెనకాల ఉన్న చెరువు వద్ద గల నాగులమ్మ పుట్ట వద్ద ఆలయ కార్య నిర్వహణ అధికారి మహేష్ , కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, అశోక్ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజలలో ఆలయ సిబ్బంది, అర్చకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు



**పరకాల, అక్టోబర్ 25 (జనం సాక్షి)** పరకాల పట్టణంలోని లిటిల్ ఫ్లవర్, శారద హై స్కూల్ లో శనివారం రోజున ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.ముఖ్యఅతిథి ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ మాట్లాడుతూతెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ లను విడుదల చేయాలని, పరకాల పట్టణంలో ఉన్న ఎస్ ఎం హెచ్ హాస్టల్ కు సొంత భవనాలు నిర్మించాలని అన్నారు.ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయాలని,ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు కార్యదర్శి ప్రేమ్, పట్టణ అధ్యక్షుడు బొచ్చు ఈశ్వర్, పట్టణ కార్యదర్శి సాయి తేజ, విద్యార్థులు పాల్గొన్నారు.

## భూపాలపల్లి ఏరియా సింగరేణి లో ఫుట్బాల్ పోటీలు ప్రారంభం



**భూపాలపల్లి, అక్టోబర్ 25 (జనం సాక్షి):**భూపాలపల్లి ఏరియా సింగరేణి కృష్ణ కాలనీలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ క్రీడా మైదానం లో 26వ వార్షిక క్రీడ పోటీలలో భాగంగా రీజియన్ స్థాయి ఫుట్బాల్ పోటీలను ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించి మాట్లాడుతూ... క్రీడలు కేవలం ఆనందం మాత్రమే కాదు, మన ఆరోగ్యానికి, శారీరక దృడాత్వానికి మరియు పట్టుదలకి ,దారితీసే మంచి మార్గం. యువ ఉద్యోగులలో ప్రతిభను వెలికితీసి కోల్ ఇండియా స్థాయిలో రాణిం చాలనే ఉద్దేశంతో క్రీడాకారులను ప్రోత్సహిస్తుందని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి, క్రీడల , స్పోర్ట్స్ సూపర్వైజర్, పర్స శ్రీనివాస్, భూపాలపల్లి స్పోర్ట్స్ కోఆర్డినేటర్ పాక దేవయ్య, ఆర్జి -3 స్పోర్ట్స్ కోఆర్డినేటర్ అంజయ్య జనరల్ కెప్టెన్ మెడ.మల్లేశ్, భూపాలపల్లి ఫుట్బాల్ కెప్టెన్ పురుషోత్తమ్, ఆర్జి -3 ఫుట్బాల్ కెప్టెన్ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ ఏసీబీ నేరస్థుడి ఫోటో విడుదల



**వరంగల్ ఈస్ట్, అక్టోబర్ 25 (జనం సాక్షి)** వరంగల్ ఆర్టీఏ లో విధులు నిర్వహిస్తున్న ఎంవీఐ జైపాల్ రెడ్డి నీ మోసం చేసి పది లక్షల రూపాయలు కాజేసిన ఘటనలో, సైబర్ నిందితుడిని బెంగళూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ప్రధాన నిందితుడి పేరు రాచమల్ల శ్రీనివాస్ అలియాస్ మంగళ శ్రీను గా తెలిపిన పోలీసులు.. ఎట్టకేలకు సదరు సైబర్ నేరగాన్ని పట్టుకోవడంలో పోలీసులు చేసిన కృషి అభినందనీయమని చెప్పవచ్చు.

## పాఠశాల ఆవరణలో నిత్యం పరిశుభ్రత పాటించాలి - మార్కెట్ కమిటీ చైర్మన్




**జనగామ ప్రతినిధి, అక్టోబర్ 25(జనంసాక్షి):** తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజ్ ఉమెన్ జనగామ ఎన్ఎస్ఎస్ యూనిట్ వారు 7 రోజులు స్పెషల్ క్యాంపు కార్యక్రమము నందు రెండవ రోజు జనగామ మండలం శామీర్ పేట గ్రామంలో జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ముఖ్య అతిథిగా జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ పాల్గొని మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు పరిశుభ్రత మరియు దాని ప్రాముఖ్యత గురించి వివరించడం జరిగింది. మనం నిత్యజీవితంలో తప్పకుండా పరిశుభ్రతను పాటించాలి అని దాని ద్వారానే మనము ఆరోగ్యగా ఉండగలమని ఆరోగ్యమే మహాభాగ్యము అని వివరించడం జరిగింది. వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు పరిసరాల ప్రాముఖ్యత కూడా ఎంతో అవసరం అని తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ రెడ్డి గారు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఉమెన్ డిగ్రీ కాలేజ్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీమతి కె.అరుణ కుమారి మరియు ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ తో కలిసి పాఠశాల ఆవరణలోని కలుపు మొక్కలను తొలగించి పాఠశాల విద్యార్థులకు పరిశుభ్రతను అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి స్వప్న, ఉపాధ్యాయులు, విద్యార్థి, విద్యార్థినులు,నాయకులు కాంసాని భాస్కర్ రెడ్డి , సాదం మధుసూదన్,కరోబర్ పాషా ,రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీఎల్ క్రికెట్ టోర్నీ కి టీ- షర్టులు స్పాన్సర్



**మల్హర్,అక్టోబర్25(జనంసాక్షి)**మండలంలోని వల్లెంకుంట లో మొట్ట మొదటి సారిగా నిర్వహిస్తున్న మల్హర్ క్రికెట్ లీగ్ టోర్నీ లో ఆడుతున్న 11 టీం క్రీడాకారులకు శనివారం యువ జనతా ఫౌండేషన్ ప్రసిడంట్, హై కోర్టు న్యాయవాది బుద్దార్థి నవీన్ టీ షర్ట్స్ స్పాన్సర్ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు ఆడటం వల్ల మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యం మెరుగు పరిచేందుకు, వ్యూహాత్మక ఆలోచనలు పెంపొందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు సింగనవేణి సంతోష్, నార రాజశేఖర్, నవీన్ సలాడీ క్రీడాకారులు పాల్గొన్నారు.

# లంబాడీలను ఎస్టి జాబిత నుండి తొలగించాలి

### ఆదివాసి సంఘాల జేఏసీ

**మంగపేట అక్టోబర్ 25(జనంసాక్షి)**ఆదివాసీలకు విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాలలో న్యాయం జరగాలంటే మన వాటా మనకు దక్కాలి అంటే లంబాడీలను ఎస్టీ జాబితా నుండి తొలగింలి అని ఆదివాసి సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. లంబాడీలను ఎస్టి జాబితా నుండి తొలగించాలని రాష్ట్ర వ్యాప్తంగా ఆదివాసీలు నిర్వహిస్తున్నటువంటి పోరాటాలలో భాగంగా నవంబర్ 3వ తేదీనా వై జంక్షన్ నుండి ఐటిడిఏ వరకు ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని అనంతరం ఐటిడిఏ ఏటూరునాగారం పీవోకు వినతి పత్రం అందజేయడం జరుగుతుంది అని కార్యక్రమాన్ని ఆదివాసీలు ఐకమత్యంతో పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయవలసిందిగా తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కబ్బాక శ్రావణ్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శనివారం మండలంలోని తొండ్యాల లక్ష్మీపురం, కోమటిపల్లి, కొత్తూరు మొట్లగూడెం, బొమ్మయిగూడెం గ్రామాలలో ఆదివాసి సంఘాల జేఏసీ నాయకులు పర్యటించి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసి సేన సీనియర్ నాయకులు కల్తి రామకృష్ణ, తుడుందెబ్బ నాయకులు ఆగబోయిన సాయి కుమార్, చంద్ర కాంత్, గ్రామ పెద్దలు బోదేబోయిన నర్సయ్య, కోరం లక్ష్మీపతి, బంగారి సాంబయ్య, యలగొండ సాంబశివ రావు, జోగ లక్ష్మీనర్సయ్య, వట్టం లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.





# నాగేంద్రగిరిస్వామి ఆలయంవద్ద వైభవంగా నాగుల చవితి వేడుకలు

**మహదేవపూర్: అక్టోబర్ 25 (జనంసాక్షి).** నాగులచవితి పర్వ దినం సందర్భంగా శనివారం రోజున నాగేంద్రగిరి అయ్యప్ప స్వామి ఆలయం ఆవరణలోని నాగులమ్మ పుట్టవద్ద మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పుట్టచుట్టూ 5 ప్రదర్శనలుచేసి ముగ్గువేసి రేడు ఆకులుపెట్టి దీపానివెలింగిచి పసుపు కుంకుమ వేసి నువ్వులపొడితో నైవేద్యం పేట్టి పుట్టలో ఆవులుపోసి నమస్కారించుకోన్నారు.ప్రజ నమ్మకం ప్రకారం నాగుల చవితి రోజు పుట్టకు పాలు పోసి ప్రదర్శనలు చేస్తే సంతానం లేని వారికి సంతానం కలుగుతుందని అంతేకాకుండా నాగ దోష రాహు కేతు దోషాలు. ఇతర ఆనర్ధక ప్రబావాలు తొలగిపోతాయని కూడా నమ్ముతారు. అనంతరం ఆలయంలోని అయ్యప్ప స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు భక్తులకు అభిషేకాలు కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ చల్లా తిరుపతిరెడ్డి మాజీ ఎంపీటీసీ చల్ల రమణారెడ్డి. దంపతులు. ఉపాధ్యాయులు బండం రాజిరెడ్డి రజిని దంపతులు. అయిత సరోజన రాజిరెడ్డి . దంపతులతో పాటు మైలలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జీవిత బీమా చేయండి జీవితానికి అండగా ఉండండి



**కాళేశ్వరం , అక్టోబర్ 26, ( జనం సాక్షి)**జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం లో ఎల్ ఐ సి జీవిత బీమా ఏజెంట్ల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కరీంనగర్ సీనియర్ డివిజనల్ మేనేజర్ శివ నాగ ప్రసాద్ మాట్లాడుతూ జీవిత బీమా చేయండి కుటుంబానికి అండగా ఉండండి అంటూ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ సోమశేఖర్, సేల్స్ మేనేజర్ రాజేష్ ఖన్నా,పెద్దపల్లి బ్రాంచ్ మేనేజర్ రవి నాయక్, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ అచ్యుత్ రావు, మంథని సాటిలైట్ ఆఫీస్ మేనేజర్ రామ కిషన్, డెవలప్మెంట్ ఆఫీసర్లు హరి కిరణ్, పి ఆర్ కె రెడ్డి, 300 మంది ఏజెంట్లు పాల్గొన్నారు.

# రక్తదానం చేయడం వల్ల ప్రాణదాతలు అవుతారు

• **ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్**

**వరంగల్ ఈస్ట్, అక్టోబర్ 25 (జనంసాక్షి):** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంలో మామునూరు సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో ఒక మెగా రక్తదాన శిబిరంను బొల్లికుంటలోని వాగ్దేవి కాలేజ్ ఫార్మసీ బ్లాక్లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున వాగ్దేవి కాలేజ్ విద్యార్థులు, వివిధ గ్రామాల ప్రజలు, మరియు పోలీస్ సిబ్బంది పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ప్రధాన అతిథిగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, ఐపీఎస్ పాల్గొని రక్తదాతలను అభినందించారు. ఆయన మాట్లాడుతూ,రక్తదానం చేయడం ద్వారా అనేకమంది ప్రాణాలను కాపాడుతున్నారు. రోడ్డు ప్రమాదాలు లేదా అత్యవసర వైద్య పరిస్థితుల్లో రక్తం కొరత వల్ల ఎన్నో ప్రాణాలు పోతున్నాయి. మీ రక్తదానం వల్ల ఆ ప్రాణా లు కాపాడబడతాయి అని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ఏసీపీ మామునూర్ ఎన్. వెంకటేష్ సమన్వయం చేశారు. ఇందులో మామునూరు, గీసుకొండ, ఏనుమాముల, అయినవోలు, సంగేమ్, పర్వతగిరి పోలీస్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. సీఐ మామునూర్ శ్రీ ఓ. రమేష్ సీఐ పర్వతగిరి శ్రీ రాజగోపాల్ గారు, సీఐ ఏనుమాముల సురేష్ , సీఐ గీసుకొండ శ్రీ విశ్వేశ్వర్ , ఎస్సైలు శ్రీనివాస్ (అయినవోలు), (సంగేమ్) వంశీకృష్ణ , ప్రవీణ్ (పర్వతగిరి), కృష్ణవేణి, శ్రీకాంత్ (మామునూర్), కుమార్, అనిల్ (గీసుకొండ) పాల్గొన్నారు.



# క్రీడా దుస్తులు పంపిణీ



**కురవి, అక్టోబర్ 25(జనంసాక్షి):** తెలుగు సమితి అఫ్ నేబ్రాస్కా , స్ఫూర్తి ఎడ్యుకేషన్ రూరల్ డెవల ప్మెంట్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చింతపల్లి నం దు క్రీడా దుస్తులు 25 మంది విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి చింతపల్లి ఉన్నత పాఠశాల ప్రధా నోపాధ్యాయులు బానోత్ శంకర్ అధ్యక్షత వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు ఇలాంటి కార్యక్రమాలు చేయడం చాలా సంతోషం, మనమే కాకుండా మనతో పాటు మన వారిని అందరూ పైకి తీసుకురావాలని కోరారు .స్ఫూర్తి ఫౌండేషన్ వారు ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులపై చూపించే ఔదార్యానికి కృతజ్ఞతలు తెలిపారు. స్ఫూర్తి ఎడ్యుకేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు రామసహాయం శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ను క్రీడలలలో ప్రోత్సాహించాలని ఉద్దేశంతో క్రీడా దుస్తులు పంపి ణీ చేయడం జరిగింది అన్నారు తల్లితండ్రులు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పిం చాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద నిరుపేద విద్యార్థులకు సహకారం అం దిం చుటకు సంస్థ పని చేస్తుంది అన్నారుచదివే పిల్లలకు బుధవారము, శనివారము వేసుకునే విధంగా ప్రోత్సహించాలనే సదుద్దేశంతో ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల ఈ కార్యక్రమములో స్ఫూర్తి ఎడ్యుకేషన్ ప్రధానకార్యదర్శి మేకల కృష్ణయ్య, ఉపాధ్యాయులు నాగరాణి,సత్తార్,వజ్ర కుమారి,రవీందర్,జ్యోతి,మాధవ్,ప్రదీప్ కుమార్ , విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు , విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా నాగుల చవితి వేడుకలు



**పరకాల, అక్టోబర్ 25 (జనంసాక్షి):** పరకాల పట్టణంలోని శ్రీ కుంకు మేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీకమాసం శనివారం రోజున నాగుల పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని పరకాల పట్టణం, వివిధ గ్రామాల మహిళలు పెద్ద ఎత్తున తెల్లవారు జామున ఆలయానికి విచ్చేసి స్వామివార్లను దర్శనం చేసుకుని ఆలయాల ప్రాంగణంలోని పుట్టలో పాలు పోసి నాగుల పంచమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తూ స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరిస్తూ భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

## నీటి కష్టం తీర్చిన ఎమ్మెల్యే




**బెల్లంపల్లి, అక్టోబర్ 25, (జనంసాక్షి):** బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండలం కొత్తూరు గ్రామంలోని షిర్కే వాడలో నీటి ఎద్దడి విషయం మండల యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ మహ్మద్ జలీల్ ఎమ్మెల్యే గడ్డం వినోద్ దృష్టికి తీసుకువెళ్లారు. షిర్కే వాడలో హ్యాండ్ బోర్ ఉన్నప్పటికీ బకెట్ నీళ్లు కూడా రావడం లేదని, ప్రజలు నీళ్ల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సమస్యను వివరించడంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే గడ్డం వినోద్ నూతన బోరు, మోటారు మంజూరు చేశారు. బోర్, మోటారు ఏర్పాటు చేసి శనివారం ప్రారం భించడంతో షిర్కే వాడ ప్రజలు ఎమ్మెల్యే గడ్డం వినోద్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఎందరో ప్రజాప్రతినిధులకు విన్నవించు కున్నా పట్టించుకోలేదని కాని ఎమ్మెల్యే మాత్రం అడిగిన వెంటనే మం జూరు చేసి యుద్ధ ప్రాతిపదికన పనులుపూర్తి చేసి నీరందించారని తెలిపారు.

# రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

• **మార్కెట్ వైస్ చైర్మన్ కొల్లూరి శివకుమార్**

**లింగాలఘణపురం, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని,రైతులకు గిట్టుబాటు ధర కల్పించి వారిని ఆర్థికంగా అభివృద్ధి చేయాలన్నదేకాంగ్రెస్ లక్ష్యమని జనగామ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ కొల్లూరి శివకుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసే ధాన్యం కొనుగోలు కేంద్రంతో పాటు,వడ్డిచర్ల, కొత్తపల్లి, నేలపోగుల గ్రామం లో ఏర్పాటు చేసిన ఐకేపీ కొనుగోలు కేంద్రాలను ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వరి ధాన్యాన్ని విక్రయించడానికి దళారులను నమ్మితే తక్కువ ధరకు కొనుగోలు చేసి రైతు కష్టానికి గండి కొడుతున్నారన్నారు . అందుకే ప్రతి రైతు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో మాత్రమే విక్రయించాలని సూచించారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్ద పీట వేసింది అన్నారు. రైతు కష్టానికి ప్రతిఫలం అందించడమే ముఖ్యమంత్రి సంకల్పం అన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ శ్రీశైలం, సీఈఓ శ్రీనివాస్, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు లోక్కుం ట్ల ప్రవీణ్, డైరెక్టర్, వేముల కృష్ణారెడ్డి,రామ చందర్, నాయకులు గుగ్గిల నర్సియ్య, బుషి గంపల ఆంజనే యులు, రాజశేఖర్, సోషల్ మీడియా ఇంచార్జ్ రాజు, పాల్గొన్నారు.



## మెగా జాబ్ మేళా ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే



**బెల్లంపల్లి, అక్టోబర్ 25, (జనంసాక్షి):** బెల్లంపల్లి పట్టణంలో నేడు చేపట్టే మెగా జాబ్ మేళా ఏర్పాట్లను శనివారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి సంస్థ, నోబెల్ ఎంపవర్ మెంట్ సొసైటీ సంయుక్తంగా నిర్వహించే జాబ్ మేళాలో నిరుద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సింగరేణి అధికారులు, స్థానిక అధికారులు సమన్వయంతో జాబ్ మేళాను విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఆయన వెంట సింగరేణి జనరల్ మేనేజర్ రాధకృష్ణ, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కోట గుళ్ళలో ఘనంగా నాగుల చవితి వేడుకలు

• నాగేంద్ర స్వామికి పంచామృతాలతో అభిషేకం
• భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించిన మహిళలు



**గణపురం, అక్టోబర్ 25 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని ప్రసిద్ధిగాంచిన చారిత్రక సంపద కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళ లో శనివారం నాగుల చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజతో ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు పూజా కార్యక్రమాలను ప్రారంభించారు అనంతరం ఆలయ ప్రాంగణంలోని నాగేంద్ర స్వామికి పంచా మృతాలతో అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు నాగదేవుని పుట్ట వద్ద పాలు పోసి దీపాలను వెలిగించారు. కార్తీక మాస నాగుల చవితి కావడంతో పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పూజలు నిర్వహించిన భక్తులకు ఆలయ అర్చకులు నాగరాజు ఆశీర్వచనాలు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

# సీఎం సహాయనిధి పేదలకు వరం

• **నాగపురి కిరణ్ కుమార్ గౌడ్. నూకల బాల్ రెడ్డి**

**బచ్చన్నపేట అక్టోబర్ 25 (జనంసాక్షి):** పేద ప్రజల వైద్య ఖర్చులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఇచ్చే సహాయము వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్. బచ్చన్నపేట మండల అధ్యక్షులు నూకల బాల్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని బండనాగారం గ్రామ పద్మశాలి సామాజిక వర్గ కుటుంబానికి చెందిన రాపెల్లి కమల భర్త నారాయణ మోకాళ్ళ మార్పిడి సమస్యతో బాధపడుతుండగా, మండల అధ్యక్షుడు నూకల.బాల్ రెడ్డి. బండనాగారం గ్రామ శాఖఅధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి ద్వారా విషయం తెలుసుకున్న నాగపురి కిరణ్ కుమార్ గౌడ్ వెంటనే బీసీ సంక్షేమ , రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ దృష్టికి తీసుకు రాగా వెంటనే స్పందించి లక్ష యాభై వేల రూపాయల ఎల్ఓసి మం జూరు చేయించారు. అట్టి ఎల్ఓసి మంజూరు పత్రాన్ని బాధిత కుటుం బానికి నాగపురి కిరణ్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ సి.ఎం.ఆర్.ఎఫ్ (ఎల్ఓసి)నిమం జూరు చేయించిన మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞ తలు తెలిపారు. నాగపురి కిరణ్ కుమార్‌కు నూకల బాల్ రెడ్డి . శ్రీధర్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు.



# అంబేద్కర్ నేషనల్ అవార్డుకు కిరణ్ ఎంపిక



**చిట్యాల ,అక్టోబర్ 25( జనం సాక్షి):**మండల కేంద్రానికి చెందిన అంబేద్కర్ యువజన సంఘం మండల సీనియర్ నాయకులు గురుకుంట్ల కిరణ్ ,అంబేద్కర్ నేషనల్ అవార్డు కు ఎంపికైనట్లు స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఇండియా ఎన్జీవోస్ వ్యవస్థాపకులు మరియు చైర్మన్ డాక్టర్ ఆకుల రమేష్ తెలిపారు. చిట్యాల మండల అంబేద్కర్ యువజన సంఘంలో గత 15 సంవత్సరాలుగా బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తూ , భావజాలాన్ని ముందుకు తీసుకెళ్ళుచూ మరియు మహనీయుల కార్యక్రమాలను నిర్వహిస్తూ మృతుల కుటుంబాలను , పరామర్శించి సహాయ సహకారాలు అందించాడని, దళితులపై, మహిళలపై జరుగుతున్న సంఘటనలను ఖండిస్తూ వారికి అండగా నిలబడ్డారని , సామాజిక సేవ కార్యక్రమాలు అనేకం చేశాడని అన్నారు . అతను చేస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేయడం జరిగిందని డాక్టర్ రమేష్ చెప్పారు. అంబేద్కర్ నేషనల్ అవార్డుకు ఎంపికైన గురుకుంట్ల కిరణ్ కు నవంబర్ 5న సిటీ కల్చరల్ సెంటర్ ఆడిటోరియం ఆర్టిసి క్రాస్ రోడ్ ముషీరాబాద్ వివేక నగర్ కవాడిగూడ హైదరాబాద్ లో ఈ అవార్డు అందించడం జరుగుతుందని తెలిపారు. కిరణ్ మట్లాడుతూ నాకు ఈ అవార్డు ఎంపిక చేసిన డాక్టర్ ఆకుల రమేష్ కి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఉత్తమ ఉపాధ్యాయురాలికి మండల విద్యాధికారి సన్మానం



**సారంగాపూర్, అక్టోబర్ 25(జనం సాక్షి)**2025 సంవత్సరంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన వారికి గురుపూజోత్సవ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు నిర్మల్ జిల్లా కలెక్టర్, నియోజకవర్గం ఎమ్మెల్యే చేతుల మీదుగా ఇటీవల ప్రధానం చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయులతో పాటు ప్రైవేటు ఉపాధ్యాయులకు కూడా అవార్డులు ప్రధానం చేశారు. సారంగాపూర్ మండలం కౌట్ల బి గ్రామంలోని నేతాజీ పబ్లిక్ స్కూల్ ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయురాలు మంచాల కృపారానికి కలెక్టర్ అభిలాష అభినవ్, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు అందుకున్నారు. వారిని ప్రశంసిస్తూ శనివారం నేతాజీ పబ్లిక్ స్కూల్ పాఠశాల యాజమాన్యం మండల విద్యాధికారి మహేందర్ చేతుల మీదుగా మెమొంటో జ్ఞాపికను అందజేసి సన్మానించారు. విద్యార్థుల పురోభివృద్ధికి మార్గదర్శిల ఉపాధ్యాయులు పనిచేస్తారని తెలిపారు జీవన మనుగడలో విద్యను మించిన సంపద ఏది లేదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రేగుంట గంగాధర్, పాఠశాల వ్యవస్థాపకులు ఐర రామ్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ చవాన్ ప్రకాష్ జడ్పిహెచ్ఎస్ పాఠశాల స్కూల్ అసిస్టెంట్ నారాయణరెడ్డి, అశోక్, నేతాజీ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్షేత్ర పర్యటనలో భాగంగా కేన్ రక్షిత ప్రాంతాన్ని సందర్శించి అధ్యయనం చేసిన వాగ్దేవి విద్యార్థులు

**ములుగు ప్రతినిధి,అక్టోబర్ 25(జనంసాక్షి).**హనుమకొండ వాగ్దేవి డిగ్రీ %ఱ% పిజి కళాశాల వృక్షశాస్త్ర విభాగ విద్యార్థులు క్షేత్ర పర్యటన (ఫీల్డ్ ట్రిప్) లో భాగంగా పాలంపేట గ్రామ శివారులోని కేన్ రక్షిత ప్రాంతాన్ని సందర్శించి, సమగ్ర అధ్యయనం గావించారు. ఈ సందర్బంగా కేన్ మాన్ అఫ్ తెలంగాణ డా సుతారి సతీష్ విద్యార్థులకు కేన్ మొక్కల ప్రాముఖ్యత, కేన్ ప్రాంతం ఏ రకంగా జీవవైవిధ్యం తో కూడి వున్నది, తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడా లేని ఈ మొక్కల ప్రాంతాన్ని కాపాడుకోవాల్సిన ప్రాశస్త్యాన్ని విద్యార్థులకు వివరించారు. అదేవిధంగా, విద్యార్థులు రామప్ప ఆలయం, సరస్సులను సందర్శించారు. ఆలయ గైడ్ విజయ్ రామప్ప ఆలయ విశిష్టత, కాకతీయుల శిల్ప కళా నైపుణ్యం, గొలుసు కట్టు చెరువుల గూర్చి విద్యార్థులకు వివరించారు. అనంతరం, ఏటూరునాగారం అభయారణ్యం, బ్లాక్బెర్రీ ఐలాండ్ లను సందర్చించి, దేశీయ మొక్కలు, జీవావరణంలో అడవుల పాత్ర, జీవవైవిధ్యత, ఔషధ మొక్కలు, గిరిజన జాతులు స్థానిక మొక్కలను వివిధ రోగాలను నయం చేయడానికి వాడే విధానం, వంటి విషయాలపై అవగాహన విద్యార్థులకు డా సతీష్ అవగాహన కల్పించారు. ఈ క్షేత్ర పర్యటనలో అధ్యాపకులు డా. హరేంధేర్ రెడ్డి, కవిత, రమేష్, యాకూబ్ పాషా, మోహన కృష్ణ, సురేష్, శివ, తదితరులు పాల్గొన్నారు.



## కాపాస్ కిసాన్ యాప్ ద్వారానే పత్తి విక్రయించాలి



**పరకాల రూరల్, అక్టోబర్ 25 (జనం సాక్షి):**రైతుల కోసం వ్యవసాయ శాఖ రూపొందించిన కాపాస్ కిసాన్ యాప్ ద్వారా పత్తి విక్రయించాలని నాగారం క్లస్టర్ వ్యవసాయ విస్తరణాధికారి కాటమరాజు తెలిపారు. శనివారం నాగారం రైతు వేదికలో కపాస్ కిసాన్ యాప్ ద్వారా పత్తి విక్రయించే విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈఓ కాటమరాజు మాట్లాడుతూ రైతులు పండించిన పత్తి విక్రయం కోసం ముందుగా యాప్ లో తమ మొబైల్ నెంబర్ రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. సంబంధిత రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. రైతులు వారి ఫోన్ నెంబర్లు ఏమైనా మార్చుకో వాలనుకుంటే తనని సంప్రదించి మార్చుకోగలరని తెలిపారు. ఈ సమావేశంలో ఏఈఓ తో పాటు రైతులు వేల్పుల ఓదేలు, శివాజీ, సారయ్య, వెంకటేష్, రాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ధ్వంసమైన నార్త్ కెనాల్ మరమ్మత్తు పూర్తి



**భీమదేవరపల్లి:అక్టోబర్25(జనం సాక్షి)** హనుమకొండ జిల్లా భీమదేరుపల్లి మండలం విశ్వనాథ్ కాలనీలోఇటీవల కురిసిన వర్షాల కారణంగా ధ్వంసమైన దేవాదుల నార్త్ కెనాల్ మరమ్మత్తు పనులను పూర్తి చేసినట్లుబీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గద్ద కుమారస్వామి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నీటి సరఫరా అంతరాయం కలగకుండా తక్షణ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.నార్త్ కెనాల్ పనులు జరుగుతున్న సమయంలో కాంట్రాక్టర్ రవీందర్ రెడ్డి,ఏఈ తోపాటు తానే అక్కడ ఉండి పనులు వేగంగా పూర్తయ్యేలా అధికారులతో నిరంతరం ఫోన్‌లో సంప్రదిస్తూ పర్యవేక్షణ చేసినట్లు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గద్ద కుమారస్వామి తెలిపారు.రైతులకు సమయానికి నీరు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

## ఖైదీల జీవితం లో మార్పు రావాలి




**పరకాల, అక్టోబర్ 25 (జనం సాక్షి):** పరకాల పట్టణంలోని స్థానిక సబ్ జైలును జువేనైల్ జస్టిస్ బోర్డు సభ్యులు మేరుగు సుభాష్ శనివారం సందర్శించారు. జైలు పరిసరాలను పరిశీలించి ఖైదీల వివరాలను తెలుసుకున్నారు. ఎవరైనా 18 ఏండ్ల లోపు వయస్సు గల జువేనైల్ ఉన్నారా అని అరా తీసారు. ఏఏ నేరాల్లో జైలు శిక్షలు అనుభవిస్తున్నారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో వారు మాట్లాడుతూ శిక్ష కాలంలో ఖైదీలు పూర్తి పరివర్తన చెందాలని, బయటకు వెళ్లిన తరువాత గౌరవప్రదమైన జీవితం గడపాలని సూచించారు. కార్యక్రమంలో డి. పి. ఓ రమణ మూర్తి, లీగల్ ఎయిడ్ కౌన్సిల్, జైల్ సూపరిండెంట్ ప్రభాకర్, మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గంగాదేవి దేవాలయంలో కంచు గంటను ఎత్తుకెళ్లిన దొంగలు



**గూడూరు,అక్టోబర్25(జనంసాక్షి):**గూడూరు మండల కేంద్రంలోని ఎర్రగొల్ల సంఘం ఆధ్వర్యంలో 6సంవత్సరాల క్రితం పాకాల వాగు దగ్గర నిర్మించిన గంగాదేవి దేవాలయంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆలయ ముఖద్వారానికి కట్టిన 12000 వేల రూపాయల విలువగల కంచు గంటను దొంగలు దొంగిలించారని పెద్దగొల్ల నాయకులు ఆరోపించారు.శనివారం ఉదయం దేవాలయనికి వెళ్లన సంఘం నాయకులు చుసి ఆశ్చర్యపోయారు.చూసే సరికి కంచు గంటను ఎత్తుకు పోయారని,గతంలో కుడా ఇదే దేవాలయంలో దేవునికి సమర్పించే కానుకల గల్లా పెట్టె హుండీని కుడా ఎత్తుకెళ్లినట్లు దేవాలయంలో ఇది మూడవ సారి దొంగతనం జరిగినట్లు,పాకాల వాగు ఏరియాలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలనీ పెద్దగొల్ల పుట్ట లింగయ్య,సారగోళ్ళ బత్తుల మల్లయ్య ఆరోపించారు.

## స్కూల్‌లో జరిగిన దాడి ఘటనలో ఒకరిపై కేసు




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** బిట్స్ స్కూల్ టీచర్ పై దాడి చేసిన ఘటనలో శ్యాంలాల్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేయడం జరిగిందని, ఈ సంఘటనలో మరింత పూర్తిస్థాయిలో విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామని భూపాలపల్లి సీఐ నరేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ స్థానిక బిట్స్ స్కూల్ లో విద్యార్థులను ఇబ్బంది పెట్టిన విషయమై తమకు స్కూల్ విద్యార్థుల నుండి గాని, వారి తల్లిదండ్రుల నుండి గాని ఎటువంటి ఫిర్యాదు రాలేదన్నారు. అటువంటి సమస్య ఏదైనా ఉంటే విద్యార్థులు గాని, వారి తల్లిదండ్రులు గాని మాకు సమాచారం ఇవ్వాలని, లేదా భూపాలపల్లి షీ టీంకు ఫిర్యాదు చేసినట్లయితే వెంటనే అట్టి విషయంపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థి సంఘాలు విద్యార్థుల సమస్యలపై ప్రజాస్వామ్య పద్ధతిలో మాత్రమే నిరసన కార్యక్రమాలు నిర్వహించుకోవాలని, లేదా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసుకోవాలని, అంతేగాని విద్యాసంస్థలపై దాడి చేసి ఆస్తి నష్టం చేయడం, లేక విద్యాసంస్థలలో పనిచేస్తున్న సిబ్బందిపై భౌతిక దాడులకు పాల్పడినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలలో గాని, కళాశాలలో గాని, హాస్టల్లో గాని, విద్యార్థిని విద్యార్థులను ఎవరైనా ఇబ్బంది పెడితే బాధితులు డయల్ 100 కు గాని, లేదా భూపాలపల్లి సీఐ 8712658110, ఎస్సై 8712658120, 8712658121, పోలీస్ స్టేషన్ 8712658142, షీ టీమ్ 8712658162 నెంబర్లకు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని ఆయన తెలియజేశారు.

## మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**స్టేషన్ ఘన్ పూర్, అక్టోబర్ 25 ( జనం సాక్షి ) :**స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రానికి చెందిన నూక అనసూర్య అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. విషయం తెలుసుకున్న మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి శనివారం పార్థివాదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిం చారు.ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిం చారు.మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించారు. కాంగ్రెస్ నాయకుడు, జనగామ జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు తెల్లాకుల రామకృష్ణ ఆధ్వ ర్యంలో మృతురాలి రెండు నేత్రాలను హైద్రాబాద్ లోని ఎల్.వి ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ కు దానం చేసినందు కు కుటుంబ సభ్యుల సేవతత్పరతను కొనియాడారు.ఈ కార్యక్రమంలోఎమ్మెల్యేవెంటస్థానికనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# చిల్పూర్ మండలానికి 80 కోట్లు మంజూరీ చేయించిన కడియం

- చిల్పూర్ దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు
- చిల్పూర్ మండలంలో కడియం శ్రీహరి మార్క్



**స్టేషన్ ఘన్ పూర్, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** మాజీ ఉప ముఖ్యమంత్రి, స్థానిక ఎంఎల్ఏ కడియం శ్రీహరి సహకారంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిల్పూర్ మండలానికి 80 కోట్ల నిధులు మంజూరీ చేయడం జరిగిందని చిల్పూర్ గుట్ట శ్రీ బుగులు వెంక టేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ పోట్లపల్లి శ్రీధర్ రావు అన్నారు. ఎంఎల్ఏ కడియం శ్రీహరి అభివృద్ధి నిధులు మంజూరుచేయించినందుకుగాను చిల్పూర్ దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు ఆధ్వర్యంలో చిల్పూర్ మండలం లోని పల్లగుట్ట గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఫ్లెక్సీ లకు పాలభిషేకం చేసారు. ఈ సందర్భంగా పోట్లపల్లి శ్రీధర్ రావు మాట్లాడుతూ చిల్పూర్ మండలంలో 80 కోట్ల మంజూరుతో కడియం శ్రీహరి మార్క్ ప్రారంభం అయింది అని అన్నారు. 17.60 కోట్లతో పల్లగుట్ట క్రాస్ నుండి మల్లన్న గండి వరకు పల్లగుట్ట,కృష్ణాజి గూడెం, ఫతేపూర్, గార్లగడ్డ తండ గ్రామాల మీదిగా డబుల్ రోడ్డు మంజూరు కావ డం జరిగిందని,2.5 కోట్ల తో లింగంపల్లి నుండి అబ్దుల్ నాగరం వరకు, 14.52 కోట్ల తో గోవర్ధనగిరి నుండి చిల్పూర్ వరకు, 46.03 కోట్లతో చిన్నపెండ్యాల నుండి తరిగొప్పుల వరకు,104.34తో రాజవరం నుండి కిమా తండ వరకు నిధులు మంజూరు కావడం జరిగిందని అన్నారు. ట్రైబల్ బిటి రోడ్స్ వాచ్య తండా 37.38, ఫకీర్ తాండ 37.32, ఎస్సీ ,ఎస్టి సబ్ ప్లాన్ 110కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా కడియం శ్రీహరి గ కృషి చేస్తున్నారని అన్నారు. 1997లో కడియం శ్రీహరి మంత్రిగా ఉన్నప్పుడు మంజూరైన రోడ్లు తప్ప, నేటికీ రోడ్లు మంజూరు కాక ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదు ర్కొంటున్న దృష్ట్యా కడియం శ్రీహరి కృషితో రోడ్ల కు మళ్లీ నిధులు మంజూరు కావడం జరిగింది అన్నారు. బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు చౌకబార్ విమర్శలు మాను కొని నియోజకవర్గంలో కడి యం శ్రీహరి చేస్తున్న అభి వృద్ధికి సహకరించాలని అన్నారు. కడియం శ్రీహరి నాయకత్వంలో చిల్పూరుగుట్ట శ్రీబుగులు వెంకటేశ్వర స్వామి దేవస్థానం కూడా అన్ని విధాల అభివృద్ధి జరుగుతుందని అన్నారు. నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డి, ఎంపీ కడియం కావ్య,ఎమ్మెల్యే కడియం శ్రీహరి లకు, సంబంధిత మంత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బొమ్మిశెట్టి బాలరాజు, గడ్డమీది సురేష్ మాట్లాడుతూ 1997లో మంజూరైన రోడ్లు దెబ్బతిన్నప్పటికీ నేటివరకు ఏఎమ్మెల్యే పట్టించు కోలేదని,15 సంవత్సరాల నిరీక్షణ తర్వాత పొట్లపల్లి శ్రీధర్ రావు కృషి వల్ల ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ శాఖ రోడ్లు, ట్రైబల్ రోడ్లు ఎమ్మెల్యే కడియం శ్రీహరి మంజూరు చేయించడం జరిగింది అన్నారు. నియోజక వర్గ అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే పని చేయడం జరు గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ వైస్ చైర్మన్ చీర నాగరాజ్ గౌడ్, నాయకులు బొమ్మిశెట్టి బాలరాజు, గడ్డమీది సురేష్,స్వామి నాయక్, ఎన్నకూస కుమార్,బానోత్ రూప్లా నాయక్, సంజీవ, మోహన్, మల్లారెడ్డి, పేరాల సుధాకర్, రత్నాకర్ రెడ్డి, బిక్షపతి, యాదగిరి ,జీడి ఆనందం,సాదం రాజేందర్,గట్టయ్య, కృష్ణ ,మండల ముఖ్యానాయకులు,దేవస్థానం డైరెక్టర్లు, మార్కెట్ డైరెక్టర్లు, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్లు, మాజీ ఎంపిటిసిలు, యువజన నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నాగమయ్య గుడిలో జిల్లా న్యాయమూర్తి పూజలు



**వరంగల్ ఈస్ట్,అక్టోబర్ 25 (జనంసాక్షి):** నాగుల చవితి పర్వదినం సందర్భంగా వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని అండర్ రైల్వే గేట్ ఉరుసు సుభాష్ నగర్ శ్రీ నాగేంద్ర స్వామి దేవాలయం (నాగమయ్య గుడి)లో శనివారం వరంగల్ జిల్లా న్యాయమూర్తి నిర్మల గీతాంబ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జాగర్లపూడి శ్రీరామ్ శర్మ, కోటయ్య శర్మలు అర్చనలు చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రసాద్ తో పాటు ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

## కొయ్యూరు పోలీసుల విస్తృత తనిఖీలు



**మల్హర్, అక్టోబర్ 25 (జనంసాక్షి):** కొయ్యూరు ఎస్ఐ 2 రాజన్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం రోజు మంథిని – కాటారం ప్రదాన రహదారి పై పోలీసులు విస్తృతంగా వాహనాలను తనిఖీ చేశారు. అనుమానిత వాహనాలను నిలిపి క్షుణ్ణంగా పరిశీలించారు. వాహన దారుల లైసెన్సులను ఇతరత్రా ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. సరైన పత్రాలు లేని వాహనాలను, నంబర్ ప్లేట్లు లేకుండా రోడ్డు పై నడిపిస్తే సీజ్ చేస్తామని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ వాడాలని సూచించారు. ఈ తనిఖీల్లో కానిస్టేబుల్స్ మోసిన్, మాచర్ల మధుకర్, టీజీ ఎస్పీ స్టాఫ్, మోత్కూరి భూపాల్, త్రివాసు, శివ పాల్గొన్నారు.

## గోవింద్ ప్రదీప్ వైద్య చికిత్సకు దాతలు సహకరించాలి

- 17 వేలు ఆర్థిక సహాయం అందజేసిన దాతలు



**స్టేషన్ ఘన్ పూర్, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన గోవిందు ప్రదీప్ ప్రమాదవశాత్తు ఘన్పూర్ నుండి తాటికొండ కు వెళ్లు క్రాస్ రోడ్ వద్ద ఇటీవల యాక్సిడెంట్ అయింది. చికిత్స నిమిత్తం హనుమకొండ చక్ర వర్తి హాస్పిటల్లో చేర్పించారు. కాళ్లు ఫ్యాక్చర్ అయినందున ఆరోగ్యశ్రీ కింద సర్జరీ చేశారు. మరో సర్జరీ చేయవలసి ఉందని, డాక్టర్ దానికి ఆరోగ్యశ్రీ పనిచేయదని,ఆ సర్జరీకి ఖర్చు 1,20, 000 రూపాయలు అయితాయని డాక్టర్ చెప్పి నారని బాధితుని కుటుంబ సభ్యులు తెలిపారు. నిరు పేద కుటుంబానికి చెందిన వ్యవసాయ భూమి కూడా లేని నిరుపేద కుటుంబానికి గ్రామ స్తులందరూ ఇప్పటి వరకు 17 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందిం చినారు. గ్రామంలో ఎవరికీ ఏ ఆపదైనా కులము, మత ము, బెదము లేకుండా ఎవ్వరికీ తోచినం తవారు ఆర్థిక ఆర్థిక సాయం చేస్తున్నారని, గ్రామస్తులందరూ కలిసి తోచిన విధంగా ఆర్థిక సహాయం అందించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

## విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాలలో ఉండాలి

- అడిషనల్ సూపర్డెంట్ ఉపేందర్ రెడ్డి

**నిర్మల్ రూరల్, అక్టోబర్ 25 (జనంసాక్షి):** విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థానాల లో నిలబడాలని అడిషనల్ సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ ఉపేందర్ రెడ్డి తెలిపారు. శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం యూనిట్ ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదువుకొని సమాజసేవలో భాగస్వామ్యం కావాలని తెలిపారు. అనంతరం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎం. సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులు జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరంలో ఏడు రోజులపాటు తప్పకుండా పాల్గొనీ, శాంతినగర్ కాలనీ వాసులందరికీ అన్ని అవగాహన కార్యక్రమాలు కల్పించి,వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ యు.గంగాధర్,జాకీర్ హుస్సేన్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంగోపాల్,ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ తుకారం, ఎన్ఎస్ఎస్ యూనిట్ కోఆర్డినేటర్ అర్చన, శాంతినగర్ వడ్డెర కాలనీ అధ్యక్షులు పుణ్యం, ఎంఈఓ నాగేశ్వరరావు, కోఆర్డినేటర్ సుభాష్, కళాశాల అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.




## మున్సిపల్ కమిషనర్కు వినతి పత్రం



**ఖానాపూర్ అక్టోబర్ 25 (జనంసాక్షి):** పట్టణంలో కోతులను నివారిం చాలని కోతుల బెడదతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు జరుగుతున్నాయని కోతల నివారణ ఉద్యమ కమిటీ సభ్యులు మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్ కు వినతిపత్రం సమర్పించారు. శనివారం కమిషనర్ కు వినతిపత్రం సమర్పించిన సందర్భంగా వారు మాట్లాడారు. బందర్ కో హటావో ఖానాపూర్ కో బచావో పేరుతో ఉద్యమాన్ని ఉధృతం చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. ప్రభుత్వం కోతుల నివారణకు ప్రత్యేక చర్యలు వెంటనే చేపట్టాలని లేని పక్షంలో వాడవాడలా ప్రత్యేక కమిటీలను వేసి రెవెన్యూ, మున్సిపల్ శాఖలతోపాటు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు కల్వకుంట్ల నారాయణ, బిసి రాజన్న, సతీష్ రావు, బక్కశెట్టి లక్ష్మణ్, ఎనుగందుల నారాయణ, బోయ నారాయణ, అల్లాడి వెంకటేశ్వర్లు, కిషన్, పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువు మీద దృష్టి సారించాలి

**నెరడిగొండ అక్టోబర్ 22 (జనంసాక్షి):** విద్యార్థులు ప్రభుత్వ కళాశాలకు ప్రతిరోజూ క్రమం తప్పకుండా కళాశాలకు రావాలని స్టూడెంట్ కౌన్సిలర్ నాగోరావు అన్నారు. శనివారం రోజున మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల యందు విద్యార్థినీ విద్యార్థులతో స్టూడెంట్ హెల్ప్ కార్యక్రమంలో భాగంగా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్టూ డెంట్ కౌన్సిలర్ నాగోరావు మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు ఏకాగ్రతతో చదువు మీద దృష్టి సారించాలని,ప్రతిరోజు క్రమం తప్పకుండా కళాశాలకు వచ్చి హాజరు శాతం పెరిగేల చూడాలని,అలాగే ప్రతిఒక్కరు ఉన్నత మైన లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని విజయం సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శబానతర్నమ్ అధ్యాపకుల బృందం పాల్గొన్నారు.



## వైభవంగా నాగుల చవితి మహోత్సవాలు

- పుట్టలో పాలు పోసి పసుపు కుంకుమలు వేసిన భక్తులు
- సుబ్రహ్మణ్యేశ్వర స్వామి నామస్మరణ లో భక్త జనులు

**వరంగల్ ఈస్ట్, అక్టోబర్ 25 (జనంసాక్షి):** వరంగల్ తూర్పు నియోజకవర్గం ఉరుసు సుభాష్ నగర్ లో గల శ్రీ నాగేంద్ర స్వామి దేవాలయం నాగమయ్య గుడిలో శనివారం నాగుల చవితి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు జాగర్లపూడి శ్రీరామ్ శర్మ ఉదయం నాలుగున్నర గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు స్వామివారికి వివిధ రకాల విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని అలంకరించారు. అనంతరం భక్తులు స్వామివారి దర్శనం చేసుకుని తమ కోరికలను స్వామివారికి విన్నవించారు. అదేవిధంగా భక్తులు స్వామివారి పుట్టలో పాలు పోసి పసుపు కుంకుమలు వేసి తమ భక్తిని చాటుకున్నారు. వరంగల్ నగరం నలుమూలల నుండి వేలాది మంది భక్తులు రావడంతో ఆలయ ఈవో ప్రసాద్ తో పాటు సిబ్బంది అన్ని రకాల ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఆలయ ధర్మకర్తలు భక్తులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించారు. ఈ కార్యక్రమం లోఈవో పి. ప్రసాద్ ఆలయ ధర్మకర్తలు శంకేసి అనిల్ కుమార్ , వనం వేణు ,ఈదుల లావణ్య ,విలాసాగరం సంధ్య ,వడ్లకొండ జగ న్నాథం ,కాంగ్రెస్ నాయకులు జినుక రమేష్ , దాసి రాందేవ్ పాల్గొన్నారు.





# విద్యార్థిని ఆత్మహత్యపై ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి

- యుఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజేష్ నాయక్




**భీమదేవరపల్లి అక్టోబర్ 25(జనంసాక్షి) :** వంగర గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని వర్షిత ఆత్మహత్యకు ప్రిన్సిపాల్ వేధింపులే కారణమని యుఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజేష్ నాయక్ ఆరోపించారు. భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రిన్సిపాల్‌తో పాటు కొంతమంది ఫ్యాకల్టీ సభ్యులు విద్యార్థినులను మానసికంగా వేధిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలో నాసిరకం భోజనం వడ్డిస్తున్నారని దీనిపై ప్రశ్నించిన విద్యార్థినులను టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు. తల్లి దండ్రులను కళాశాల లోపలికి అనుమతించకపోవడంవిద్యార్థినులతో మాట్లాడ నివ్వకపోవడం తీవ్రంగా ఖండించారు. వర్షిత చదువులో మెరుగైన విద్యార్థినని ఆమె మరణానికి ప్రిన్సిపాల్ బాధ్యురాలని తల్లిదండ్రులు విద్యార్థులు విద్యార్థి సంఘం అనుమానం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. వెంటనే ప్రిన్సిపాల్‌ను అరెస్టు చేసి విచారణ జరపాలని బాధ్యులను సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ వంగర గురుకుల హాస్టల్‌ను సందర్శించి విద్యార్థినుల సమస్యలపై చర్చించాలని ప్రత్యేక విచారణ కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. మృత విద్యార్థిని కుటుంబానికి ?50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి కుటుంబ సభ్యుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఆకుల మనోజ్,ఉపాధ్యక్షులు జయకృష్ణ,జ్ఞానేశ్వర్, మనోజ్,శశి,మహేష్, కోటేష్,సన్నీ,విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## పశువులకు గాలికుంటు నివారణ వ్యాధి టీకాలు వేయించాలి




**సారంగాపూర్, అక్టోబర్ 25 (జనంసాక్షి):** గాలికుంటు వ్యాధి నివారణ టీకా పశువులకు టీకా వేయడంలో జిల్లాలో ప్రారంభించారు. టీకా కార్యక్రమం ఈనెల 16వ తేదీ నుండి వచ్చే నెల 14వ తేదీ వరకు కొనసాగుతున్నడంతో నెల రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో మూడు నెలలు పై పడిన పశువులకు టీకాలు వేస్తారు. నిర్మల్ జిల్లాలోని అన్ని మండలాల గ్రామాల్లో పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. సారంగాపూర్ మండలం, లింగాపూర్ చించోలి ఎమ్ గ్రామంలో శనివారం జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ బాలిద అహ్మద్, మండల పశు వైద్యాధికారి జి నందకుమార్ గాలికుంటు నివారణ టీకాలు పశువులకు వేశారు. వ్యాధి క్రిములు గాలిలో ప్రయాణించి ఇతర పశువులకు సోకే అవకాశం ఉంది అందుచేత ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకు ఒకసారి టీకా వేసి రాబోయే నాలుగేళ్లలో గాలి కుంటు వ్యాధిని పూర్తిగా నివారించడానికి అధికారులు కార్యచరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది మల్లికార్జున్, పోతన్న, భోజన్న, సాగర్, రాజేందర్, దిలీప్ పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర

**టేకుమట్ల అక్టోబర్ 25 (జనంసాక్షి):** టేకుమట్ల మండలంలో ఇటీవల మరణించిన వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి,తన ప్రగాఢ సానుభూతి తెలియచేసిన భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి పరామర్శించిన వారి వివరాలు. రామకిష్టాపూర్ (టి) గ్రామ వాస్తవ్యులు కీ.శే అంబీర్ స్వరూప కుటుంబ సభ్యులను.. టేకుమట్ల వాస్తవ్యులు కీ.శే మాచర్ల రమణయ్య కుటుంబ సభ్యులను. ఆరెపల్లి గ్రామ వాస్తవ్యులు సీనియర్ నాయకులు, పోతుగంటి వసంతరావు తండ్రి కీ.శే పోతుగంటి లింగారావు కుటుంబ సభ్యులను. గర్మిళ్లపల్లి గ్రామ వాస్తవ్యులు,సీనియర్ నాయకులు పెర్కారి నర్సింగరావు మాతృమూర్తి కీ.శే పెర్కారి కౌసల్య కుటుంబ సభ్యులను. పరామర్శించి ఓదార్చారు అనంతరం మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి మాట్లాడుతూ మృతుల కుటుంబ సభ్యులు ఎవరు అధైర్యపడవద్దని భరోసా కల్పించారు మృతుల కుటుంబ సభ్యులకు టిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సట్ల రవి గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి ఆకునూరి తిరుపతి, ముఖ్య నాయకులు ఆది రఘు, బందెల నరేష్, నేరెళ్ల శ్రీనివాస్, ఉద్దమారి మహేష్ మారం లింగారెడ్డి, కొండ్ర ఓదెలు, నల్లబెల్లి రవీందర్, దొడ్ల కోటేశ్వర్,గువ్వాడి లక్ష్మణ్,శ్రీధర్ రెడ్డి, అన్నయ్య, మహేందర్,పసరగొండ లక్ష్మణ్, బాబు రావు, గువ్వాడి శివ,గొల్ల పెల్లి రఘు,సంపత్, శ్రీనివాస్, సాంబశివరావు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కోటగుళ్ళను సందర్శించిన ఇంగ్లండ్ దేశస్థులు



**గణపురం, అక్టోబర్ 25 (జనంసాక్షి):** ప్రసిద్ధి గాంచిన చారిత్రక సంపద కాకతీయుల కళా క్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళను శనివారం ఇంగ్లాండ్ దేశానికి చెందిన దంపతులు మిచెల్ రిచర్డ్, ఎలిజబెత్ లు సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ చరిత్రను శిల్పకళ నైపుణ్యాన్ని రామప్ప గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ వారికి వివరించారు. అనంతరం ఇంగ్లాండ్ దేశస్థులు ఆలయ శిల్ప సంపదను ఆలయ ప్రాంగణంలోని శివ ద్వారా పాలక విగ్రహాలను ఫోటోలు వీడియోలు చిత్రీకరించుకున్నారు. కోటగుళ్ల శిల్ప సంపద ఎంతో అద్భుతమని వారు ఈసందర్భంగా అన్నారు.

## అంగన్వాడి సెంటర్ లో ఘనంగా ఈసీసీఈ డే



**స్టేషన్ ఘన్ పూర్, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** స్టేషన్ ఘన్పూర్ పట్టణ కేంద్రంలోని 6వ అంగన్వాడి సెంటర్‌లో అంగన్వాడి టీచర్ మునిగాల రాణి ఆధ్వ ర్యంలో ఈసీసీఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించా రు. ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్ మునిగాల రాణి మాట్లాడుతూ ప్రతి నెల నాలుగవ శనివారం ఈసీసీఈ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. పిల్లలచే పాటలు పాటించడం, వివిధ కృత్యాలు చేయడం జరుగిందని, ఫ్రీ స్కూల్ మెటీరియల్ ప్రదర్శించడం జరిగిందని అన్నారు. ఈనెలలో చేయిం చిన కార్యక్రమాలన్నీ తల్లిదండ్రుల ముందు చేయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో దారం కుమార స్వామి, రాములు, గోనెల సోమలక్ష్మి, కొలిపాక లత, తల్లిదండ్రులు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

- భక్తులతో రద్దీగా మారిన లక్ష్మీ నరసాపురం శ్రీ నాగులమ్మ ఆలయం

**మంగపేట అక్టోబర్ 25 (జనంసాక్షి):** భక్తిశ్రద్ధలతో నాగుల చవితి వేడుకను ఘనంగా నిర్వహించారు. భక్తులు తెల్లవారుజాము నుండే పలు ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. అనంతరం నాగదేవుత ప్రతిమలకు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి పుట్టలలో పాలు పోశారు. మండలంలోని కమలాపురం, మంగపేట, నర్సాపూర్ బోర్, చెరుపల్లి, తిమ్మంపేట, మల్లూరు పరిసర గ్రామాలలోని నాగులమ్మ పుట్టల వద్ద భక్తులతో కోలాహలంగా మారాయి. అలాగే మండలంలోని వాగొడ్డుగూడెం గ్రామపంచాయతీ పరిధిలో గల లక్ష్మీ నర్సాపూర్ గ్రామంలో స్వయంభువుగా వెలసిన శ్రీ నాగులమ్మ ఆలయల ప్రాంగణం భక్తులతో పూర్తిగా రద్దీగా మారింది. భక్తులు నాగులమ్మ పుట్టకు, కంక నాగుల పుట్టకు ప్రత్యేక పూజలు నిర్వహించి పాలు, పండ్లు, గుడ్లు, వివిధ రకాల పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం భక్తులు శ్రీ నాగులమ్మ అమ్మవారిని దర్శించుకోగా ఆలయ ప్రధాన పూజారి బాడిశ రామకృష్ణ స్వామీజీ భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.



## ఘనంగా నాగుల చవితి వేడుకలు



**ఆత్మకూరు, అక్టోబర్ 25 (జనంసాక్షి):** ఆత్మకూరు: మండల కేంద్రంలోని శ్రీ పార్వతీ సమేత మహాదేవ స్వామి ఆలయంలో కార్తీక మాస నాగుల చవితి ను పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగేంద్ర స్వామికి ఆవు పాలతో అభిషేకం నిర్వహించడం జరిగింది. అనంతరం స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేయడం జరిగింది .కార్యక్రమంలో అర్చకులు శరత్ శర్మ, శ్రావణ్ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల బెంచీల బహూకరణ



**చిట్యాల, అక్టోబర్ 25( జనంసాక్షి):**దేవాలయం లాంటి విద్యాలయంలో పాఠాలు నేర్చుకొని ప్రయోజకులైన పూర్వ విద్యార్థులు ఆ పాఠశాలకు బెంచీలను బహూకరించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులైన బత్తిని రాజు గౌడ్, తిప్పారపు సురేందర్, లాండిగ రాజు, మూగ రమేష్, నర్సింగారావులు జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్ళపల్లి మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పదవ తరగతి వరకు విద్యనభ్యసించారు. కాగా వారు పాఠశాలలో చదువుకున్నప్పటి స్మృతులను నెమరు వేసుకుంటూ బెంచీలను బహూకరించి మరెంతో మంది యువకులకు ఆదర్శంగా నిలిచారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి



సారంగాపూర్ మండలంలోని అడెల్లి, దేవినగర్ తండాలో మాజీ మంత్రివర్యులు అల్లోల ఇంద్ర కరణ్ రెడ్డి బాధిత కుటుంబాలకు శనివారం పరామర్శించారు. దేవినగర్ తండా లొ జాదవ్ ప్రకాష్ తండ్రి జాదవ్ బలరాం ఇటీవల మరణించారు వారి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం అడెల్లి గ్రామం ఆర్మీ ఉద్యోగం చేస్తున్న రంజిత్ రావు తండ్రి జువ్వడి గంగారావు మూడు రోజుల క్రితం మరణించగా వారికుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతిని తెలియపరి చారు. వారి వెంట మాజీ ఎంపీపీ అట్ల మహిపాల్ రెడ్డి, మాజీ కన్వీనర్ మాధవ రావు, వ్యాపారవేత్త అల్లోల మురళీధర్ రెడ్డి, మాజీ అడెల్లి ఆలయ చైర్మన్ ఐటి చందు, మాజీ సర్పంచ్ సుచరిత రాజేశ్వర్, దావజీ నాయక్ పలువురు ఉన్నారు.

## విద్యార్థులకు పోలీస్ శాఖ సేవలపై అవగాహన కలిగి ఉండాలి

### వంగర ఎస్సై దివ్య



**భీమదేవరపల్లి అక్టోబర్ 25 (జనంసాక్షి) :** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు భీమదేవరపల్లి మండలం వంగర పోలీస్ స్టేషన్‌లో శనివారం విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వంగర ఎస్సై దివ్య విద్యార్థులకు పోలీస్ శాఖ అందిస్తున్న సేవలు శాఖ పనితీరు వైర్లెస్ సెట్ వినియోగం పోలీస్ లాకప్ ఎఫ్ఐఆర్ నమోదు విధానం సీసీ కెమెరాల పనితీరు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ విధానం డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల కలిగే ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే డయల్-100 సేవలు రిసెప్షనిస్ట్ బాధ్యతలు ఫింగర్‌ప్రింట్ సాంకేతికత ద్వారా నేరస్తులను గుర్తించే విధానం పోలీస్ ఆయుధాల వినియోగం సంఘవిద్రోహ శక్తుల చేతిలో వీరమరణం పొందిన పోలీస్ అమరవీరుల త్యాగాలు భరోసా సెంటర్ షీ టీమ్ కార్యకలాపాలు ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంపై కూడా విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు పోలీస్ స్టేషన్ పనితీరు.శాఖ ప్రజల శాంతి భద్రతల పరిరక్షణలో పోషిస్తున్న పాత్రను అర్థం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వంగర ఎస్సై జి.దివ్య, పోలీస్ సిబ్బంది ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాలకుర్తిలో ఘనంగా నాగుల చవితి వేడుకలు



**పాలకుర్తి, అక్టోబర్ 25 (జనంసాక్షి):** నాగుల చవితిని పురస్కరించుకొని శనివారం మండల కేంద్రంలోని పాటిమీది అంజనేయ స్వామి ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. నాగుల చవితిన పుట్టలో పాలు పోస్తే అష్ట ఐశ్వర్యాలు చేకూరుతాయని సర్పపూజ చేయడం అనాదిగా వసున్న సంప్రదాయం, కుజ దోశాలున్నవారు, సంసారిక బాధలు ఉన్నవారికి శుభం కలుగుతుందనే నమ్మకం. భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అర్చకులు దేవగిరి అనిల్. ఆలయ ప్రధాన పూజారి గంగు రఘుశర్మ ఆధ్వర్యంలో మహిళా భక్తులు పూజలు నిర్వహించారు.

## డ్రగ్స్ నివారణలో పోలీస్ పాత్ర

- మాదకద్రవ్యాల పై వ్యాసరచన పోటీలు
- కొయ్యూరు ఎస్ఐ 2 రాజన్ కుమార్




**మల్హర్, అక్టోబర్ 25 (జనంసాక్షి):** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ సందర్భంగా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొయ్యూరు ఎస్ఐ 2 రాజన్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని ఎడ్లపల్లి మోడల్ స్కూల్, దుబ్బపేట కెజీబీవి బాలికల పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డ్రగ్స్ నివారణలో పోలీసుల పాత్ర, విద్యార్థులు డ్రగ్స్ నుండి ఎలా దూరంగా ఉండగలరు అనే అంశం పై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అంతేకాకుండా సమాజ శ్రేయస్సు, శాంతి భద్రతల కోసం పోలీసులు అందిస్తున్న సేవలు, త్యాగాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన

# విద్య బోధన అందించాలి

- చెన్నారావుపేట మండల విద్యాశాఖాధికారిని సరళ

**చెన్నారావుపేట, అక్టోబర్ 25 (జనంసాక్షి):** విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించాలని మండల విద్యాశాఖ అధికారిని బైరి సరళ అన్నారు.శనివారం చెన్నారావుపేట ప్రాథమిక పాఠశాలను ప్రార్థన సమయంలో ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులను, తరగతి గదుల్లో ఉపాధ్యాయుల భోధనను పరిశీలించి తగు సూచనలు అందించారు. విద్యార్థులందరూ క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు కావాలని, స్వచ్ఛ పక్వడా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు ఇల్ల సూరయ్య, ఉపాధ్యాయులు పూదోట అనిల్ కుమార్, మర్రి రాజు, మంజుల, కన్యదార అనిల్ కుమార్, భూక్య క్రాంతి పాల్గొన్నారు.

## గాలికుంటు వ్యాది నివారణకు టీకాలు



**పాలకుర్తి, అక్టోబర్ 25(జనంసాక్షి):** పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని చెన్నూరు పశువైద్యాధికారి డాక్టర్ రమ్య అన్నారు. శనివారం మండలంలోని తీగారంలో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిఖిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రమ్య మాట్లాడుతూ రైతులను ఆర్థికంగా నష్టం చేసే వ్యాధులతో ముఖ్యమైన వ్యాధి గాలికుంటు వ్యాధి అన్నారు. ఈ వ్యాది వస్తే సూడి పశువులకు అబార్షన్ అయ్యే అవకాశం ఉందని, పాడి పశువులు ఆదిక జ్వరంతో బాదపడుతూ, ఎద్దులు దుక్కి దున్నే సామార్థ్యాన్ని కోల్పోతాయన్నారు.. ఈ వ్యాధి నివారణకు టీకాలతో పశువులు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. తీగారంలో 180 పశువులు, గేదెలకు టీకాలు చేశామని తెలిపారు. జూనియర్ పశువైద్యాధికారి శివప్రసాద్, రైతులు ఐలేష్, చిదురాల ఎల్లయ్య, గోపాలమిత్ర సంధ్య, అనిత ఉన్నారు.

## పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా జిల్లా లో భారీ క్యాండిల్ ర్యాలీ

**ములుగు,అక్టోబర్ 25 (జనంసాక్షి):** శనివారం సాయంత్రం ములుగు జిల్లాలో పోలీస్ అమరవీరుల స్మారక వారోత్సవాల సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్.పి ఆదేశాల మేరకు,జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది,ములుగు ప్రజలు , యువ త సమన్వయంతో ఘనంగా క్యాండిల్ ర్యాలీ నిర్వహించబడింది.ఈ ర్యాలీ ములుగు పట్టణం లోని పాత పోలీస్ స్టేషన్ నుండి ప్రారంభమై ప్రభుత్వ ఆస్పత్రి చౌరస్తా వరకు వెళ్ళి తిరిగి పాత పోలీస్ స్టేషన్ వద్దకు కొనసాగింది.ప్రతి ఒక్క పోలీసు సిబ్బంది చేతిలో క్యాండిల్ పట్టుకొని అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. కార్యక్రమానికి డీఎస్పీ రవీందర్ ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత తెలంగాణ ప్రశాంత వాతావరణం, శాంతి భద్రతలు ఇవన్నీ ఒకప్పటి పోలీసు అమరవీరుల త్యాగ ఫలితమే అని అన్నారు.ర్యాలీ మొత్తం జోహార్ జోహార్ అమరవీరులకీ అంటూ నినాదాలతో సాగి పాత పోలీస్ స్టేషన్ వద్ద ముగిసింది.ఈ కార్యక్రమంలో ములుగు సిఐ సురేష్,ఆర్ఐ లు స్వామి,సంతోష్ తిరుపతి, ములుగు ఎస్హెచ్ఓ వెంకటేశ్వరరావు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు , పెద్ద సంఖ్యలో పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



## గంజాయితో పట్టుబడ్డ వ్యక్తిపై కేసు నమోదు

**స్టేషన్ ఘన్ పూర్, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** స్టేషన్ ఘన్పూర్ పట్టణ కేంద్రం లోని బస్టాండ్ వద్ద 50 గ్రాముల గంజాయితో పట్టుబడ్డ వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేయడం జరిగిందని సిఐ వేణు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ పట్టణ కేంద్రం లోని బస్టాండ్ వద్ద ఎస్ఐ రమేష్ పోలీస్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా ములుగు కు చెందిన భూక్య సిద్ధును తనిఖీ చేయగా అతని వద్ద 50 గ్రాముల గంజాయి పట్టుబడడం జరిగిందని, దాని విలువ 2500 రూపాయలు ఉంటుందని తెలిపారు. గంజాయితో పట్టుబడ్డ వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్ ఐ వినయ్ కుమార్, ఎస్ఐ రమేష్ పోలీస్ సిబ్బం ది పాల్గొన్నారు.

## కాట్రపల్లిలో పశు వైద్య శిబిరం



**శాయంపేట, అక్టోబర్ 25 (జనంసాక్షి):** మండలంలోని కాట్రపల్లి గ్రామంలో పాఠశాల ఆవరణలో గ్రామంలోని పశువులకు స్థానిక పశువైద్యాధికారి సునిల్ ,ప్రజ్వాల్ సంస్థ సంయుక్తంగా గ్రామంలోని 105 తెల్లజాతి పశువులకు, నల్లజాతి 60 జీవాలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయటం జరిగిందని తెలిపారు. అనంతరం ప్రజ్వాల్ సంస్థ ప్రతినిధి రవిచందర్ మాట్లాడుతూ మూగజీవాలు వాటి బాధలను చెప్పలేవని ముందుగానే రైతులు నివారణకు టీకాలు వేసుకొని మూగజీవాలను రక్షించు కోవాలని రైతులు ఆర్థికంగా నష్టపోకుండా జాగర్త పడాలని వివరించడం జరిగింది .ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది రమేష్ బాబు, రవి, సదానందం, మరియు గ్రామ రైతులు వంకుడోతు దన్ సింగ్ ,వంకుడోతు. బాబూసింగ్, మీసరాగండ్ల స్వామి, మీసరాగాండ్ల సంపత్ ,జనగాం మొగిలి, పెద్దపల్లి పాణి, ఒంటెరు ప్రసాద్, నవయుగ సొసైటీ డైరెక్టర్ ఒంటెరు రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక కేజీబీవీ

### పాఠశాల విద్యార్థులు



**పెద్దవంగర అక్టోబర్ 25 (జనంసాక్షి):** చదువుతోపాటు క్రీడల్లో పాల్గొనాలని ప్రిన్సిపల్ స్రవంతి అన్నారు. మండల కేంద్రంలో ఇటీవల తొర్రూరు మండలం చర్లపాలెం గ్రామంలో జరిగినటువంటి జోనల్ 69 ఎస్జిఎఫ్ఐ క్రీడాపోటీలలో పెద్ద వంగర కేజీబీవీ పాఠశాల విద్యార్థినిలు అండర్ 17, 14 పోటీలలో కబడ్డీ,కోకో, వాలీబాల్ క్రీడలలో వరుసగా త్రివేణి, శ్రావణి, హారిక ,చైతన్య, పల్లవి,జీవిత ,సాత్విక ,వైష్ణవి , చైతన్య ,శృతి ,సంకీర్తన ,హర్షితలు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు విద్యార్థులను ప్రోత్సహించిన వ్యాయామ ఉపాధ్యాయురాలు కవితను అభినందించారు.

## వైభవంగా సకల ధాన్య సంగ్రహణ సహిత నగరోత్సవం

**పరకాల, అక్టోబర్ 25 (జనంసాక్షి):** పరకాల పట్టణంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ భవాని కుంకుమేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో కార్తీక మాస మహా రుద్ర యాగ మహెూత్సవంలో భాగంగా శనివారం రోజున సకల ధాన్య సంగ్రహణ సహిత నగరోత్సవం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. మూడు రోజులపాటు జరిగే కార్యక్రమంలో భాగంగా పరకాల ప్రజలు తమ ఇంటికి వచ్చిన నగరోత్సవ వాహనం వద్దకు వెళ్లి ధాన్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొలుగూరి రాజేశ్వరరావు, మాజీ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు ,చందుపట్ల నరసింహారెడ్డి, బండి సారంగపాణి, గందె రవి, ఆముదాల పెల్లి అశోక్, పావుశెట్టి అనిల్, గంజి వెంకటరెడ్డి, పావుశెట్టి వెంకటేశ్వర్లు, సుకన్య పాల్గొన్నారు.



# ఐటిడిఏ కొత్త భవన నిర్మాణం స్థల పరిశీలన

**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**ఏటూరు నాగారం, అక్టోబర్ 25(జనంసాక్షి).** : ఐటిడిఏ కొత్త భవన నిర్మాణం శంకుస్థాపన కొరకు అన్ని ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. శనివారం ఏటూరునాగారం మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఐటిడిఏ పిఓ చిత్ర మిశ్రా తో కలిసి ఐటిడిఏ కొత్త భవన నిర్మాణం కొరకు స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కొమురం భీమ్ స్పోర్ట్స్ స్టేడియం వద్ద అనువైన స్థలం ను గుర్తించడం జరిగిందని అన్నారు. ప్రస్తుతం ఉన్న ఐటిడిఏ భవనం శిథిలావస్థ లో ఉన్నందున నూతన భవనం నిర్మాణం కొరకు గాను రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించడం జరిగిందని అన్నారు. అంతకుముందు ఉచిత కంటి పొర చికిత్స శిబిరాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్. ఏటూరునాగారం లోని ఐటిడిఏ గిరిజన భవనంలో శంకర నేత్రాలయ ఎం ఈ ఎస్ యు హైదరాబాద్, సంజోష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి పొర చికిత్స శిబిరాన్ని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సందర్శించారు. శిబిరం లో చికిత్స చేయించు కోవడానికి దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారి వివరాలు తెలుసుకున్నారు. కంటి పరీక్ష కేంద్రం వద్ద వైద్యులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో కంటి శస్త్ర చికిత్స శిబిరం ఏర్పాటు చేయడం, ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. తన సొంత ఊరి కోసం హీరో సంజోష్ చేస్తున్న సేవ కార్యక్రమాలను కలెక్టర్ సంజోష్ ను అభినందించారు. ప్రతి ఒక్కరు సంజోష్ చేస్తున్న సేవ కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. ఇప్పటి వరకు కంటి చూపు పొర చికిత్స



పరీక్షల కోసం 590 మంది పరీక్షలు చేయించుకున్నారని, వారిలో 110 మంది శస్త్ర చికిత్సకు అర్హులు అయ్యారని సంజోష్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సినీ నటుడు సంజోష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ వీరభద్రం, తహసిల్దార్ జగదీశ్వర్,నిర్వాహకులు సంజోష్, ఉపేంద్ర రాచపల్లి, తదితరులు పాల్గొన్నారు.

# 59 మద్యం దుకాణాలకు 1863 దరఖాస్తులు

ఎక్సైజ్ యూనిట్ లో మద్యం షాపులకు దరఖాస్తు చేసిన దరఖాస్తుదారులు లేదా ఆథరైజ్డ్ రెప్రెసెంటేటివ్ 27 అక్టోబర్ 2025 సోమవారం రోజున ఉదయం 9 గంటల కల్లా ఇల్లందు క్లబ్ హౌస్ ఫంక్షన్ హాల్ నందు వారికి కేటాయించిన సీట్లలో హాజరు కావాల్సిందిగా ఈ సందర్భంగా కోరుచున్నాము. దరఖాస్తుదారులు లేదా ఆథరైజ్డ్ రెప్రెసెంటేటివ్ ఈ కార్యక్రమానికి హాజరు కావడానికి వారు దరఖాస్తు చేసిన సమయంలో వారికి ఇచ్చినటువంటి రిసిప్ట్ కం ఎంట్రీ పాస్ ఒరిజినల్ ను తీసుకొని హాజరు కావాల్సి ఉంటుందని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి తెలిపారు.

## నిరుపేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

**ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**



**పెంబి అక్టోబర్ 25 (జనం సాక్షి)** : మండలంలోని కోసగుట్ట గ్రామంలో పి వి టీ జీలు 33 కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు పత్రాలను ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ లబ్ధిదారులకు అందజేశారు. శనివారం లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. నిరుపేదల అభ్యున్నతే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఇళ్ళు లేని వారికి విడతల వారిగా ఇళ్ళు ఇస్తాం అన్నారు. పేదలకి ఇళ్ళు ఇస్తు దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఇదే కాకుండా నియోజకవర్గం లో ప్రతి రంగంలో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. అంతకుముందు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు ఉన్నారు.

## దైవ దర్శనానికి వెళ్లి వచ్చే లోగ ఇల్లు లూటీ

**దస్తురాబాద్, అక్టోబర్ 25 (జనంసాక్షి)** : మండల కేంద్రంలోని మున్యాల గ్రామానికి చెందిన సుదం ఆనందం అనే వ్యక్తి ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డారని స్థానిక ఎస్సై సాయికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సుదం ఆనందం అనే వ్యక్తి కాశీ తీర్థ యాత్రలకు 12.10.2025 నాడు వెళ్లి ఇంటికి 25.10.2025 రోజున తిరిగి ఇంటికి వచ్చి చూడగా ఇంటి లోపల గల బీరువా పగలగొట్టి ఉండడం గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారని తెలిపారు. సమాచారం అందిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని బాధితుడు తెలిపిన వివరాలు అడిగి, చుట్టు ఉన్న పరిసరాలను పరిశీలించడం జరిగిందని తెలిపారు. ఎవరో గుర్తు తెలియని దొంగలు బీరువాలో ఉన్నా మూడు జతల కాళ్ళ వెండి పట్టీలు దొంగిలించుకు పోవడం జరిగిందని ఆయన అన్నారు. పట్టీలు సుమారు 9 తులాలు ఉన్నాయని అన్నారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు క్లూస్ టీం సంఘటన స్థలాన్ని సందర్శించి వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు.

## డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పంపిణీ చేస్తామని ఆర్డిఓ హామీ

**తొర్రూరు, అక్టోబర్ 25 (జనం సాక్షి)** : అర్హులైన వారికి త్వరలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను త్వరలో పంపిణీ చేస్తామని తొర్రూరు రెవెన్యూ డివిజన్ అధికారి ఆర్డిఓ గణేష్ హామీ ఇవ్వడంతో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఖాళీ చేసి... డబుల్ బెడ్ రూమ్ ల స్థలంలోనే నేటి నుండి నిరసనను తెలియజేయడం జరుగుతుందని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో గత ఆరు నెలలుగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇల లేని నిరుపేదలకు పంచాలని చేస్తున్న నిరసనకు స్పందించిన ఆర్డిఓ త్వరలో అర్హులైన ఇల్లు లేని నిరుపేదలకు పంపిణీ చేస్తామని శనివారం హామీ ఇచ్చారు. ఆర్డీవో గణేష్, తహసిల్దార్ శ్రీనివాస్, సర్కిల్ ఇన్స్పెక్టర్ గణేష్, డిప్యూటీ తాసిల్దార్ నరసయ్య, ఆర్ఐ, సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గునిగంటి రాజన్న, జిల్లా కమిటీ సభ్యులు బొల్లం అశోక్, మండల కార్యదర్శి ఎండి యాకూబ్, పట్టణ కార్యదర్శి కొమ్మనబోయిన యాకయ్య, మండల కమిటీ సభ్యులు దోనుక దర్గయ్య, మార్త సాంబయ్య, జమ్ముల శ్రీనివాస్, నాయకులు దొమ్మటి సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

**చెన్నారావుపేట మండల వ్యవసాయ అధికారి గోపాల్ రెడ్డి**

చెన్నారావుపేట, అక్టోబర్ 25 (జనం సాక్షి): ఆర్థిక అక్షరాస్యత పై చెన్నారావుపేట మండల వ్యవసాయ అధికారి గోపాల్ రెడ్డి అవగాహన కల్పించారు. శనివారం మండలంలోని కోనాపురం గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత, సైబర్ నేరాల పట్ల శ్రీ ధరణి స్వచ్ఛంద సంస్థ చైర్మన్ కల్లెపు శోభారాణి ఆధ్వర్యంలో రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి సహకారంతో మహిళలకు, వ్యాపారులకు, యువకులకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బ్యాంకు ఖాతాదారులు చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ నేరగాళ్ల వలలో పడి డబ్బులు పోగొట్టుకొని మోసపోవద్దన్నారు. అంతేకాక ఆర్థిక అక్షరాస్యతపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా ఎఫ్ ఎల్ సి కోఆర్డినేటర్ భాస్కరాచారి, పంచాయతీ కార్యదర్శి ప్రమీల, సిఐలు హైమ, రమేష్, సుజాత, మహిళా సంఘాల అధ్యక్షులు పుష్ప, సుజాత, శాంత కుమారి, వ్యవసాయ విస్తరణాధికారి శశి కుమార్, మినీ బ్యాంకు నిర్వాహకురాలు మమత, సంస్థ ఫీల్డ్ కోఆర్డినేటర్ ఈదునూరి రమేష్, సంస్థ ఫీల్డ్ ఆఫీసర్ కీర్తన, ఎస్ బి ఐ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్ గణేష్, కళాకారులు రాజేందర్, మధు, తదితరులు పాల్గొన్నారు.

# నాని గార్డెన్‌లో 27న మద్యం షాపులకు డ్రా

**57 షాపులకు 1958 దరఖాస్తులు..**

**వరంగల్ ప్రతినిధి, అక్టోబర్ 25 (జనం సాక్షి):** వరంగల్ రూరల్ జిల్లా లోని ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఎ4 మద్యం షాపుల దరఖాస్తు ప్రక్రియ ఈనెల 23 ముగియడంతో ఈ నెల 27న ఉరుసుగుట్ట సమీపంలోని నాని గార్డెన్ లో వరంగల్ జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ జిల్లా అధికారుల సమక్షంలో జిల్లా మెజిస్ట్రేట్ కలెక్టర్ సమక్షంలో మద్యం షాపుల కోసం డ్రా తీయనున్నారు. 2025-27 సంవత్సరానికి గాను మద్యం షాపుల పర్మిట్ ప్రక్రియను కొనసాగించడానికి జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. ఆసక్తి కల మద్యం షాపులను కైవసం చేసుకోవడానికి భారీ ఎత్తున ఆశావాహులు దరఖాస్తులు చేసుకున్నారు. జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారుల ఆధ్వర్యంలో దరఖాస్తులు స్వీకరించి డ్రా ప్రక్రియను కొనసాగించడానికి ఏర్పాట్లు చేశారు. వరంగల్ రూరల్ జిల్లాలోని మొత్తం 57 మద్యం షాపులకు గాను 1958 దరఖాస్తులు స్వీకరించడం జరిగింది. దరఖాస్తు ఫీజు రూపంలో 60 కోట్ల రూపాయల ఆదాయం ప్రభుత్వ ఖజానాకు జమ అయింది. ఈ నెల 27 రోజున మద్యం షాపుల కేటాయింపుకు సంబంధించిన లాటరీ ప్రక్రియను వరంగల్ పట్టణంలోని ఉర్స్ గుట్ట సమీపంలోని నాని గార్డెన్స్ ఫంక్షన్ హాల్ నందు జిల్లా కలెక్టర్ మరియు మేజిస్ట్రేట్ డాక్టర్ సత్య శారద సమక్షంలో ఉదయం 11 గంటలకు నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి జిల్లాలోని మద్యం షాపులకు దరఖాస్తు చేసిన దరఖాస్తుదారులు లేదా ఆథరైజ్డ్ రెప్రెసెంటేటివ్ సోమవారం రోజున ఉదయం 9.30 గంటలకల్లా నాని గార్డెన్స్ నందు వారికి కేటాయించిన సీట్లలో హాజరు కావాల్సిందిగా ఎక్సైజ్ అధికారులు కోరారు. మద్యం షాపుల కోసం దరఖాస్తుదారులు లేదా ఆథరైజ్డ్ రెప్రెసెంటేటివ్ ఈ కార్యక్రమానికి హాజరు కావడానికి వారు దరఖాస్తు చేసిన సమయంలో వారికి ఇచ్చినటువంటి రశీదు, ఎంట్రీ పాస్ ఒరిజినల్ ను తీసుకొని హాజరు కావాల్సి ఎక్సైజ్ అధికారులు కోరారు.

## బోడ తండ పేరుతో నూతన బోర్డు ఏర్పాటు

**చెన్నారావుపేట, అక్టోబర్ 25(జనం సాక్షి):** మండలంలోని చెరువుకొమ్ము తండ గ్రామ శివారులోని బోడ తండ కు వెళ్లే రహదారిలో తండా పేరుతో నూతన బోర్డును బిఆర్ఎస్ మండల సోషల్ మీడియా ఇన్చార్జి బోడ మురళి నాయక్ ఏర్పాటు చేయించారు. తండా పేరుతో బోర్డు లేకపోవడంతో ఇతర గ్రామాల నుండి వచ్చిన వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో వారి ఇబ్బందులను గమనించి తండావాసుల కోరిక మేరకు బోడ మురళి నాయక్ తన సొంత ఖర్చులతో బోడ తండ పేరుపై నూతన బోర్డును శనివారం ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. సమస్య తెలిపిన వెంటనే స్పందించిన బోడ మురళి నాయక్ కి యూత్ నాయకులు, మాజీ వార్డ్ సభ్యులు, తండా ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు బోడ దంజ్య, వాంకుడోతు శ్రీను, బోడ దంజ్య, బోడ మంగిలాల్, వాంకుడోతు కిషన్, బోడ ఈర్య, జరుపుల నర్సు, బోడ రెడ్డి, యూత్ నాయకులు బద్రు, బోడ శ్రీనివాస్, రాజు, వెంకన్న, శ్రీనివాస్, శ్రీను, కిషన్, రాజేందర్, ప్రసాద్, అశోక్, సుమన్, రవి, భాస్కర్, రవి, రమేష్, తండ ప్రజలు, యూత్ నాయకులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలు హాజరు శాతం పెంచాలి

**సిడిపిఓ ఎం.ఎల్లమ్మ**

**మరిపెడ అక్టోబర్ 25 (జనంసాక్షి)** : మహబూబాద్ జిల్లా కలెక్టర్ గారిఆదేశాల మేరకు ఈరోజుమరిపెడ మండల కేంద్రంలో అంగనవాడి టీచర్లకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసి ఆ సదస్సులో ఐసిడిఎస్ మరిపెడ ప్రాజెక్ట్ సిడిపిఓ ఎం.ఎల్లమ్మ మేడం మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల్లో పిల్లల హాజర్ శాతం పెంచాలని అంగన్వాడి కేంద్రాలు ఉదయం తొమ్మిది గంటలకి ఓపెన్ చేయాలని మూడు సంవత్సరముల నుండి ఆరు సంవత్సరముల పిల్లలకు ప్రీస్కూల్ యాక్టివిటీస్ చేయించడం ఎస్ఎం -ఎంఎఎం పిల్లలపై ఎక్కువ దృష్టి పెట్టడం పోషణ మరియు విద్య పూర్తి స్థాయిలో



అందించేలా ఉండాలని విధి నిర్వహణలో ఏ అంగన్వాడి టీచర్ గాని తమ వంతు బాధ్యత విస్మరించినట్లయితే వారి పైన చర్యలు తప్పకుండా ఉంటాయని వారన్నారు అంగన్వాడికి పంపించే పిల్లల తల్లిదండ్రులు మనపై పూర్తి నమ్మకం విశ్వాసంతో పంపిస్తున్నారని వారిని అంగన్వాడి కేంద్రాలలో తమ పిల్లల్లాగా చూసుకుని మళ్లీ ఈవినింగ్ టైంలో వాళ్ళ అమ్మ నాన్నలకు అప్పచెప్పేయాలని అప్పటివరకు మనం పిల్లల పట్ల తల్లి పాత్రను పోషించి ఐసిడిఎస్ మన ప్రాజెక్టుకు మరియు మన అంగన్వాడి కేంద్రాలకు మంచి పేరు తేవాలని వారు అన్నారు అంతే కాకుండా అంగన్వాడి కేంద్రాల్లోకి పిల్లల్ని పంపించే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంలో మన ముందుండాలని వారన్నారు ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓ తేజ కళ్యాణి సూపర్వైజర్స్ అంగనవాడి టీచర్స్ పాల్గొన్నారు